క్లుప్తంగా

నేడు సమర్థనారాయణ ఆరాధన


సమర్థనారాయణ మహారాజ్

ప్రొద్దుటూరు : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో వెలసిన సద్గురు సమర్థ నారాయణ ఆశ్రమంలో శుక్రవారం శ్రీసద్గురు సమర్థనారాయణ మహారాజ్ 34వ ఆరాధన మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆశ్రమ అధిపతి గోపాలస్వామి తెలిపారు. విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ప్రారంభమవుతుందని, భక్తులు పాల్గొని గురువు అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

పింఛన్లపై సర్వే


మదూరు పంచాయతీలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

చాపాడు : మండలంలోని మదూరు గ్రామ సచివాలయ పరిధిలో పింఛన్లపై సచివాలయ సిబ్బంది గురువారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ మదూరు, చెంచుపల్లె, చిన్నవరదాయపల్లె గ్రామాలలో తమ సిబ్బందితో కలిసి సర్వే చేపట్టామన్నారు. పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఇటీవల టీడీపీ నాయకులు పింఛన్లలో అనర్హులు ఉన్నారని, దీనిపై విచారణ చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అధికారుల ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు.

డీపీసీసీ వ్యవస్థాపకుడికి నివాళి


మాట్లాడుతున్న అభ్యుదయ రైతు రామానందరెడ్డి

మైదుకూరు : డీపీసీసీ వ్యవస్థాపకుడు ఎం.రాజశేఖర్‌రెడ్డి రైతులకు చేసిన సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. డీపీసీసీని ఏర్పాటు చేసి రైతులకు వ్యవసాయంలో ఎంతో సహాయ సహకారాలు అందించిన రాజశేఖర్ రెడ్డి ప్రథమ వర్ధంతిని గురువారం మండలంలోని వనిపెంట, జీవీ సత్రంలో నిర్వహించారు. వనిపెంట డీపీసీసీ కార్యాలయంలో ఎఫ్‌పీఓ అధ్యక్షుడు టి.నరసింహారెడ్డి, కుమార రాజ, రామానందరెడ్డి, సురేష్ సహాయం, బాలయ్య తదితరులు రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన రైతులకు ఎంతో సేవ చేసి రైతుమిత్రగా పేరు పొందారని గుర్తు చేసుకున్నారు. జీవీ సత్రంలో ఎఫ్‌పీఓ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సభను నిర్వహించి నివాళి అర్పించారు.

కంప చెట్లతో ఇక్కట్లు


డివైడర్ మధ్యలో పెరిగిన పిచ్చి మొక్కలు, కంపచెట్లు

చాపాడు : మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలో వాహనదారులకు ఇబ్బందికరంగా పిచ్చి మొక్కలు ఉన్నాయి. రహదారికి మధ్యలో గల డివైడర్ ఖాళీ ప్రదేశంలో ఇటీవల కురిసిన వర్షాలతోపాటు అప్పటికే ఉన్న పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరిగి పెద్దవి అయ్యాయి. వాహనాలు క్రాస్ చేసే సమయంలో కంప చెట్లు అడ్డుగా ఉంటున్నాయి. ఇదే క్రమంలో రాత్రి సమయాల్లో వాహనాల లైటింగ్ వెలుతురు డివైడర్ అవతల వచ్చే వాహనాలకు కనిపించడం లేదని వాహనదారులు అంటున్నారు. జాతీయ రహదారి అధికారులు తరచుగా రహదారిలో వాహనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ క్రమంలో అధికారులు పట్టించుకోకపోవటంతో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని పిచ్చిమొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

'రషీద్ హత్య అందరినీ కలిచి వేస్తోంది'

ప్రొద్దుటూరు : పల్నాడులో జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ హత్య రాష్ట్రంలో అందరినీ కలిచి వేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కిరెడ్డి పవన్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు అత్యంత అనాగరికంగా ఈ హత్య చేశారన్నారు. చంద్రబాబును పరిపాలన చేయాలని అధికారం ఇస్తే హత్యా రాజకీయాలతో రాష్ట్రాన్ని శ్మశానం చేస్తున్నారన్నారు. పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్పపై జరిగిన దాడిని ఖండించారు.

చౌక దుకాణాలపై పెత్తనం కోసం యత్నం

- డీలర్లను బెదిరిస్తున్న కూటమి నాయకులు
- అక్కడ కుదరక అధికారులపై ఒత్తిడి చేస్తున్న వైనం

బద్వేలు (వ్యవసాయం) : ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో చోటామోటా నాయకులు రెచ్చిపోతున్నారు. చౌక దుకాణాల డీలర్లను రాజీనామా చేయాలని డైరెక్ట్‌గా ఫోన్‌లు చేసి బెదిరింపులకు దిగుతున్నారు. నియోజకవర్గంలోని కలసపాడు మండలంలో అయితే డీలర్లపై ఒత్తిడి అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వీరి బెదిరింపులకు డీలర్లు ఎవరూ లెక్కచేయకపోవడంతో కూటమి నాయకులు రెవెన్యూ కార్యాలయాల్లో తిష్టవేసి తహసీల్దారులు, డిప్యూటీ తహసీల్దార్‌ల చేత ఫోన్‌లు చేయించి ఒత్తిడి తీసుకువస్తున్నారు. మరి కొన్ని మండలాల్లో తహసీల్దార్లు తమ మీద ఒత్తిడి చేస్తే ఏమి లాభమని, డీఎస్‌ఓ నుంచి అనుమతులు తెచ్చుకుంటే డీలర్లను మార్పు చేస్తామని కరాఖండిగా చెబుతున్నట్లు సమాచారం. జూలై మాసం రేషన్ మాత్రం పాత డీలర్లకే ప్రభుత్వ కేటాయించి లబ్ధిదారులకు పంపిణీ చేయించింది. ఆగస్టు నెలకోటా అయినా చేజిక్కించుకోవాలని ఆశావహులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. బద్వేలు నియోజకవర్గంలో పోరుమామిళ్ల యం.యల్.యస్ పరిధిలో 97 చౌకదుకాణాలు, బద్వేలు యం.యల్.యస్ కింద 75కు పైగా చౌక దుకాణాలు ఉన్నాయి. వీటిలో 50కి పైగా పర్మినెంట్ డీలర్లు ఉన్నారు. తాత్కాలిక డీలర్లతోపాటు పర్మినెంట్ డీలర్లు సైతం రాజీనామా చేయాల్సిందేనని హుంకుం జారీ చేస్తున్నారు.


కలసపాడులోని చౌకదుకాణం

మిగిలింది బియ్యమే

కూటమి అధికారం చేపట్టిన నెల నుంచే చౌక దుకాణాల్లో కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసే ఉచిత బియ్యం మాత్రమే మిగిలాయి. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో చౌక దుకాణాల నుంచి పేదలకు బియ్యంతో కలిపి ఒక్కొక్క నెల లో కందిపప్పు, రాగులు, జొన్నలు, చెక్కర, చింతపండు, గోధుమ పిండి తదితర నిత్యావసరాలు పంపిణీ చేసేవారు. కానీ జూలై నెల నుంచి కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసే ఉచితబియ్యం మాత్రమే రేషన్‌షాపులకు చేరాయి. మిగిలిన సరుకులు పేదలు అధిక ధరలు చెల్లించి బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

వేచిచూసే ధోరణిలో బడా నేతలు

గ్రామాల్లో కూటమి నాయకులు ఎంత హడావుడి చేసినా నియోజకవర్గ స్థాయిలో బడా నేతలు ఆచీతూచీ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు డీలర్లను తొలగిస్తే ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని సమాలోచనలో ఉన్నట్లు సమాచారం. అంతేగాకుండా చౌక దుకాణాల కోసం గ్రామాల్లో చోటా నేతలతోపాటు ఆశావహుల సంఖ్య పెరిగిపోతోంది. ఒక్క కలసపాడు పట్టణంలో ఉన్న రెండు చౌక దుకాణాల కోసం దాదాపు పది మంది పోటీపడుతున్నారు. నియోజకవర్గం మొత్తం మీద వందల సంఖ్యతో ఆశావహులు వేచి చూస్తున్నారు. ప్రస్తుతం ఏమాత్రం తలదూర్చినా తలనొప్పులు తప్పవని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆలోచిస్తున్నట్లు సమాచారం. అంతేగాకుండా పర్మినెంట్ చౌక దుకాణాల డీల్లర్లపై చర్యలు తీసుకుంటే వారు కోర్టుకు వెళ్లే పరిస్థితి ఉందనే ప్రస్తావన వచ్చినట్లు సమాచారం. అందుకే వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. అయినా ఆశావహులు మాత్రం వారి ప్రయత్నాలు వారు చేస్తూనే ఉన్నారు.

అధికారులపై టీడీపీ నేతల ఒత్తిడి

- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కుట్ర
- వారి భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించే యత్నం

బి.కోడూరు : మండలంలో అధికార పార్టీ నాయకుల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. రెవెన్యూ, ఏపీఎస్‌పీడీసీఎల్, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులకు ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. తాము చెప్పినట్లు చేయకపోతే మీ గురించి జిల్లా అధికారులకు తెలియజేసి సస్పెండ్ చేయిస్తామంటూ బెదిరిస్తున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక తల పట్టుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికార పార్టీ నాయకుల ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఒక పక్క పౌరసరఫరాల శాఖకు సంబంధించి రేషన్ డీలర్ల నియామకానికి ఎటువంటి జీవోలు, నిబంధనలు రానప్పటికీ ఉన్న డీలర్లను తొలగించి వెంటనే మా వారిని నియమించాలంటూ రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. గతంలో నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసిన ఏపీఎస్‌పీడీసీఎల్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని ఆ శాఖ అధికారులపై, అలాగే గత 15 ఏళ్ల అనుభవంలో సాగులో ఉన్న రెవెన్యూ భూములను సైతం వదలడం లేదు. సాగులో ఉన్న వారి భూములను తొలగించి వారు చెప్పిన వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి బోర్డులు ఏర్పాటు చేయాలంటూ రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు చేసేదేమీ లేక సెలవులపై వెళుతున్నారు. కామకుంట గ్రామ పొలం సర్వే నంబర్ 168, 202, 165, 221, 198, 199, 195, 196 లలో భూములు 15 ఏళ్లుగా అందుకు సంబంధించిన రైతులు సాగు చేసుకుంటున్నప్పటికీ, వారు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు అన్న నెపంతో రెవెన్యూ అధికారులపై టీడీపీ నాయకులు ఒత్తిడి తెస్తున్నారు. వాటిని ఆన్‌లైన్‌లో తొలగించాలని, లేదంటే అందుకు సంబంధించిన రైతులు మా కనుసన్నల్లో నడుచుకోవాలంటూ బెదిరింపులకు దిగుతున్నారు. దీనిపై మండలంలోని రైతాంగం త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడును విన్నవించుకోనున్నారు. అంతేకాకుండా అధికార పార్టీ ఆగడాలపై జిల్లా, మండల స్థాయి అధికారులకు వివరించనున్నట్లు సమాచారం. ఇకనైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న అధికార పార్టీ ఆగడాలపై విచారణ చేసి, సామాన్య ప్రజానీకానికి అండగా నిలవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి


1 కే రన్ నిర్వహిస్తున్న న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

బద్వేలు అర్బన్ : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి నిండు జీవితాన్ని కాపాడుకోవాలని బద్వేలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కోర్టు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు 1 కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ఇందుకు కారణం వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించకపోవడమే అన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో తలకు గాయం కాకపోతే సాధ్యమైనంత వరకు ప్రాణాపాయం తప్పుతుందన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వల్ల సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చనే విషయాన్ని ప్రతి వాహనదారుడు గుర్తించుకోవాలన్నారు. అలాగే అతి వేగం కూడా ప్రమాదాలకు మూలకారణమని, దీనిని నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్‌ఐ సత్యనారాయణ, రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల ఏఓ ఆర్‌వి.సాయికృష్ణ, ఏజీపీ సూర్య, న్యాయవాదులు రమణారెడ్డి, వాసుదేవరావు, ప్రభాకర్‌రావు, బాబు, ఎజాజ్‌బాషా, అఫ్తాబ్ హుసేన్, బాలక్రిష్ణ, కోర్టు సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

కాశినాయన ఆలయ అభివృద్ధికి చర్యలు


జ్యోతిక్షేత్రంలో ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

కాశినాయన : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జ్యోతిలోని కాశిరెడ్డి నాయన ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నాయకులు రితీష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జ్యోతి క్షేత్రంలో కాశినాయన ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1995లో కాశినాయన సమాధి అయ్యారని, అప్పటి నుంచి కాశినాయన భక్తులు ఆలయ నిర్మాణాలు చేపడుతూ వచ్చారని తెలిపారు. ఎనిమిది దశాబ్దాల చరిత్ర ఉన్న క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తున్న తరుణంలో పదేళ్ల కిందట ఆటవీ అధికారులు అనుమతి లేదంటూ పనులు నిలిపివేశారని చెప్పారు. ఆలయ అభివృద్ధికి 12.98 హెక్టార్ల భూమి అవసరముందన్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఎంత భూమి అవసరమో అంతకు రెండింతలు భూమిని అటవీ అధికారులు అడగగా ఆశ్రమ నిర్వాహకులు ఒప్పుకున్నారని చెప్పారు. వారం రోజుల కిందట అటవీ అధికారులు ఆశ్రమం వద్దకు వచ్చి కొన్ని భవనాలు తొలగించేందుకు మార్కింగ్ ఇచ్చారని తెలిపారు. ఆశ్రమాన్ని ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు ఏటా సందర్శిస్తున్నారని చెప్పారు. ఆటవీ శాఖ అనుమతిలేకపోవడంతో పనులు నిలిచిపోయాయని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కేంద్ర ఆటవీ శాఖ అధికారులకు వివరించి అనుమతులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బొజ్జ రోషన్న, ఆలయ నిర్వాహకులు చెన్నారెడ్డి, కమిటీ సభ్యులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నారు. శుక్రవారం తెల్లవారుజామున బాబాకు కాగడ హారతితో వేడుకలు ప్రారంభమవుతాయి. ఆదివారం సామూహిక శ్రీసాయి సత్యవ్రతాలు, మధ్యాహ్నం అన్న ప్రసాద వినియోగం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని దొరసానిపల్లె షిర్డి సాయిబాబా ఆలయంలో శనివారం నుంచి గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. శనివారం బాబా ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించనున్నారు.

- స్థానిక లైట్‌పాలెం సెంటర్‌లో ఎంవీఎస్ ధ్యానకేంద్రంలో శుక్ర, శని, ఆదివారాల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని కైవల్య సత్సంగ్ శిష్యబృందం ఒక ప్రకటనలో తెలిపింది. కైవల్య తీర్థ స్వామి రోజూ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 8 గంటలకు ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఉపన్యాసాలు ఉంటాయని తెలిపారు.

కొనసాగుతున్న ప్రాకార నిర్మాణ పనులు


ప్రాకారం కోసం సత్రాలను తొలగించిన దృశ్యం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. ఇందులో భాగంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ముందు భాగంలో నూతనంగా ప్రాకారం పనులు చేపట్టారు. మఠం ఫిట్‌పర్సన్, ఎండోమెంట్ ఏసీ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో మఠం మేనేజర్ పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే దేవస్థానం పరిధిలో భక్తులకు అవసరమైన పనులు పూర్తి కావచ్చాయి. ఇందులో భాగంగానే ప్రాకార నిర్మాణాలు జరుగుతున్నాయి. మఠం దక్షణద్వారం సమీపంలో ఉన్న పాత సత్రాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక భక్తులు కోరుతున్నారు. ఎలాగో ప్రాకారం కోసం ఒక వైపు సత్రాలను తొలగించారు. ఇదే అదునుగా పాత సత్రాలను పూర్తి స్థాయిలో తొలగించి, వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించి ప్రస్తుతం ఉన్న వారికి తిరిగి ఇచ్చేలా చూడాలని భక్తులు కోరుతున్నారు. దేవస్థానం నిర్వాహకులకు స్థానికులు సహకరించాలని కోరుతున్నారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు


అర్కటవేములలో పీరును ఊరేగిస్తున్న దృశ్యం

రాజుపాళెం : మండలంలోని అర్కటవేములలో గురువారం మొహర్రం వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉన్న పీర్ల చావిడిలోని పెద్ద ఓబుళ కొండన్నస్వామి పీరును ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. అనంతరం చిన్న ఓబుళ కొండన్నస్వామి పీరును ఊరేగించారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా కలిసి రంగులు చల్లుకుంటూ ఎంతో ఆనందంగా పండుగను జరుపుకొన్నారు. స్వామి తమ ఇంటి వద్దకు రాగానే నీళ్లు పోసి టెంకాయలు కొట్టి చదివింపులు చేశారు. ఈ వేడుకలకు బంధువులు, స్నేహితులు, చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు

కాశినాయన : వర్షాభావ పరిస్థితులతో నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, నాయకుడు పోలయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నలక్ష్మికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2021 నుంచి 2023 జూలై వరకు పంట నష్ట పరిహారాన్ని గత ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసిందని చెప్పారు. గతేడాది డిసెంబర్ నెలలో వచ్చిన తుపాన్‌తో రైతులు నష్టపోయారని చెప్పారు. బాధిత రైతులకు పరిహారం అందించాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా అన్నదాతలకు అవసరమైన విత్తనాలు, పురుగుల నివారణ మందులు అందించాలని కోరారు. 100 రోజుల ఉపాధి పనిదినాలను 200 రోజులకు పెంచాలని, రోజుకు కనీసం వేతనం రూ.600 చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు : ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు పుట్టకుండా ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం కీటక జనిత వ్యాధులు, స్టాప్ డయేరియా గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వార్షకాలం కావున వీధులు, ఇంటి పరిసరాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు ఎక్కువగా ఉంటాయని, దీనివల్ల మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. దోమలు కుట్టకుండా దోమ తెరలను వాడాలని తెలిపారు. జ్వరం వస్తే వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకొని చికిత్స తీసుకోవాలని సూచించారు. డాక్టర్ మౌనిక మాట్లాడుతూ డయేరియా వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మునిరత్నం, మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెచ్‌ఈఓ సుబ్బరాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషా, సీఓ నాగజ్యోతి, ఉపాధ్యాయులు, మున్సిపల్, సచివాలయ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే


ప్రొద్దుటూరులో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా గురువారం నుంచి ఆగస్టు 2 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు డాక్టర్ భరత్‌నారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బాలాజీనగర్, పవర్‌హౌస్ రోడ్డులో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాలని తెలిపారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, మెరిసే జిడ్డుగల చర్మం ఉండటం, చెవులు, వీపులు, ఎదపై నొప్పిలేని బొడిపెలు ఏర్పడటం, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం తదితర లక్షణాలు ఉంటే కుష్టువ్యాధిగా భావించాలన్నారు. ఇలాంటి లక్షణాలు కలిగిన వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలని కోరారు. డాక్టర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారించిన అనంతరం ఆరు నెలల పాటు ఎండీటీ మందులు వాడితే పూర్తిగా నయం అవుతుందని వారు పేర్కొన్నారు. ఎండీటీ మందులను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

చాపాడు : కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లెలో వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సహకరించాలని వైద్య సిబ్బంది సర్వేలో కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రహంతుల్లయ్య, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, ఎంఈఓ వంశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు సరస్వతి, బాబురెడ్డి పాల్గొన్నారు.

బియ్యం అక్రమ వ్యాపారం అరికట్టండి

- కేసీ కెనాల్ తూములకు మరమ్మతులు చేయండి
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


హౌసింగ్ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


సమావేశంలో పాల్గొన్న మండల ప్రజాపరిషత్ సభ్యులు

ప్రొద్దుటూరు : రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం గురించి డిపార్ట్‌మెంట్ అధికారులకు తెలుసునని, కట్టడి చేయాల్సిన బాధ్యత మీపైనే ఉందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తహసీల్దార్ విద్యాసాగర్‌ను ఉద్దేశించి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదారుగురు వ్యాపారులు బియ్యాన్ని సేకరించి నిల్వ ఉంచి రవాణా చేస్తున్నారన్నారు. వారు ఎవరెవ్వరు అనేది కింది స్థాయి అధికారులకు తెలుసునన్నారు. ఇటీవల రాయచోటి వద్ద బియ్యం లారీని పట్టుకున్నప్పుడు వ్యాపారుల వివరాలు వెలుగులోకి వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ స్పందిస్తూ బియ్యం వ్యాపారంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొంత మంది డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేశామని అన్నారు. కౌలు రైతులకు కొత్తగా కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి కేసీ కెనాల్ తూములకు మరమ్మతులు చేయాలని కోరగా వెంటనే మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనుల నిర్వహణకు ప్రభుత్వం వద్ద నుంచి డబ్బు మంజూరయ్యేందుకు ఆలస్యమైతే గ్రామ స్థాయిలో నిధులు సమీకరించి పనులు పూర్తి చేయాలని కోరారు. జగనన్న కాలనీల్లో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులను చేర్పించాలని తెలిపారు. మండలంలోని 2046 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయని, వీటిలో 1442 గ్రూపులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు మంజూరు చేయాల్సి ఉందని, ఎన్నికల కోడ్ కారణంగా జాప్యం జరిగిందని ఏపీఎం వెంకటసుబ్బమ్మ తెలిపారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల పరిధిలో రుణాల మంజూరుకు సంబంధించి జాప్యం జరిగిందని చెప్పారు. మండల పరిధిలో 87 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యాప్‌లను ఏర్పాటు చేశారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రఫియాభాను తెలిపారు. మన బడి నాడు–నేడు పథకానికి సంబంధించి ఇంకా కొన్ని పాఠశాలలకు బిల్లులు మంజూరు కావాల్సి ఉందని ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి చెప్పారు. ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ కారణంగా మండలంలో పది పాఠశాలల్లో సింగిల్ టీచర్లు ఉన్నారన్నారు. విద్యావలంటీర్లను మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. పదో తరగతిలో 73 శాతం మాత్రమే టెన్త్ విద్యార్థులు పాస్ అయ్యారని అధికారులు తెలపగా, రాత్రిళ్లు మీరు గ్రామాలకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు పిల్లలు వెళుతున్నప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు ఎందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత గల ఉపాధ్యాయులు ఉన్నా, ప్రైవేటు పాఠశాలల్లో లేకున్నా అక్కడికి తమ పిల్లలను పంపడానికే తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారన్నారు. మరో మూడు నాలుగు మీటింగ్‌ల తర్వాత ఈ విషయాన్ని ఫాలో అప్ చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ జేష్టాది శారద, డీఎల్‌డీఓ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


విద్యార్థులకు అవగాన కల్పిస్తున్న సబ్‌యూనిట్ అధికారి నరసింహారెడ్డి

పోరుమామిళ్ల (అట్లూరు) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహాలతోపాటు రెసిడెన్షియల్ పాఠశాలలోని ఆవరణంలో గురువారం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఏసీఎం ద్రావణం పిచికారీ చేయించారు. అనంతరం విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా డయేరియాతోపాటు చికున్‌గున్యా, మలేరియా, ఫైలేరియా, డెంగీ, మెదడువాపు, జ్వరం లాంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. కావున పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెసిడెన్షియల్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య, ఏఎన్‌ఎం నిర్మళ, ఎంఎల్‌హెచ్‌పీ ఐశ్వర్య, హెల్త్ అసిస్టెంటు సాదు సత్యనారాయణ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ బాలుడు, శ్రీనివాసులు, భార్గవి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల యోగక్షేమాల కోసం సభ్యత్వ నమోదు


సమావేశంలో పాల్గొన్న జనసేన నాయకులు

పోరుమామిళ్ల (అట్లూరు) : కార్యకర్తల యోగక్షేమాల కోసం జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతోందని ఆ పార్టీ బద్వేలు నియోజకవర్గ కోఆర్డినేటర్ నందకిషోర్ మొలతాటి పేర్కొన్నారు. పోరుమామిళ్ల పట్టణంలోని నూతన జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం పోరుమామిళ్లతోపాటు కాశినాయన, కలసపాడు, బి.కోడూరు మండలాల క్రియాశీలక వలంటీర్ల ద్వారా పార్టీ సభ్యత్వ నమోదు కార్యాక్రమం చేపట్టడంపై సమావేశమయ్యారు. కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, బి.కోడూరు మండలాల అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, ఖలీల్‌భాషా, లక్షుమయ్య, శివశంక్ రమణయ్య, మధుసూదన్‌రెడ్డి, ఇమ్రాన్, రఘు, మస్తాన్, పవన్‌బాబు, హుషేన్ తదితరులు పాల్గొన్నారు.